క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన జీజీహెచ్ సూపరింటెండెంట్



కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

కాకినాడ సిటీ: కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ (పూర్తి అదనపు బాధ్యతలు)గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం పాండురంగ విఠల్ మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ జీజీహెచ్ సూపరింటెండెంట్ విఠల్‌ను అభినందించారు.

డాక్టర్ విఠల్‌కు అభినందనలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు వివిధ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఉద్యోగులు డాక్టర్ విఠల్‌ను ఆయన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ వివాదరహితుడిగా, సమర్థవంతమైన వైద్యుడిగా పేరొందిన డాక్టర్ విఠల్ సూపరింటెండెంట్ హోదాను అందుకోవడం హర్షణీయమన్నారు. జీజీహెచ్ సర్వతోముఖాభివృద్ధికి డాక్టర్ విఠల్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు వనచర్ల వీరభద్రరావు, జయచంద్ర పాల్గొన్నారు. అనంతరం స్కూల్ ఆఫ్ నర్సింగ్ బృందం డాక్టర్ విఠల్‌ని కలిసి అభినందనలు తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత భారతరత్న అంబేడ్కర్



కరపలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్ తదితరులు

కరప: మానవులంతా సమానమేనని చాటిచెప్పిన స్ఫూర్తి ప్రదాత, ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విశ్రాంత అధికారి డాక్టర్ నందిక ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీవీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి రూ 6.50 లక్షలతో నిర్మించిన షెల్టర్‌ను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, బౌద్ధ ఉపాసకులు గిడ్ల వరప్రసాదరావు, రచయిత సవిలే రాజేష్, అంబేడ్కరిస్టులు గెల్లా శివకుమార్, కె.శ్రీరామచంద్రమూర్తి, కమిడి శ్రీనివాస్, మార్నెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, సాదే లోహిదాస్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



నడకుదురులో కొవ్వొత్తులతో ర్యాలీ

కరప: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిపిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం గ్రామస్తులతో కలసి సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా బాల వికాస కేంద్రాల ప్రముఖ్ గుండు విశ్వనాథం మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈచర్య అమానుషమని, ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పైలా లోవరాజు, పి.వీరవెంకటరమణ, ఎం.ప్రవీణ్, డాక్టర్ వీరభద్రరావు, ఇనుకోటి సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, జి.రాజేష్, ఎం.హర్ష పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మృతి

కాకినాడ క్రైం: పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న చింతలపూడి వెంకటలక్ష్మి(58) మంగళవారం మృతి చెందారు. కాకినాడలోని శారదాదేవి దేవాలయం సమీపంలో తన సొంత ఇంట్లో వెంకటలక్ష్మి ఒంటిరిగా నివసిస్తున్నారు. ఆమె భర్త కోవిడ్‌తో మృతి చెందగా, అంతకు ముందు వైద్య విద్యనభ్యసించిన చిన్నకుమారుడు మనో వేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దకుమారుడు రెండేళ్ల క్రితం శ్వాసకోస సమస్యతో చనిపోయాడు. దీంతో వెంకటలక్ష్మి ఒంటరి అయ్యారు. మంగళవారం ఇంటిలో అద్దెకు ఉంటున్న వారు వెంకటలక్ష్మి బెడ్ రూంలో విగత జీవిగా పడి ఉండడాన్ని కిటికీలో నుంచి గుర్తించి ఆమె బంధువులకు సమాచారం అందించారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ఆమె బంధువులు మంగళవారం రాత్రి కాకినాడకు బయల్దేరారు.

పార్కుల్లో సందర్శకుల సందడి

- ఆహ్లాదం కోసం నగరవాసులు పార్కులకు పయనం
- ఆటపాటలు, క్రీడా శిక్షణతో ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు
- కాకినాడలో సాయంత్రం సమయంలో కిక్కిరిసిపోతున్న పార్కులు
- సాగరతీరానికి తరలివస్తున్న పర్యాటకులు



సందర్శకులతో కిటకిటలాడుతున్న గాంధీనగర్ పార్కు

బోట్‌క్లబ్: వేసవి కాలం వచ్చిందంటే చాలు.. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఇంటి నుంచి కాసేపు అలా బయటకు వచ్చి ఆనందంగా.. ఆహ్లాదంగా గడపాలనుకుంటారు. సాయంత్రం వేళ బయటకు తీసుకెళితే చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు. కాకినాడ పట్టణంలో పిల్లల ఆటపాటలతో ఉద్యానవనాలు, ఖాళీ స్థలాలన్నీ కళకళలాడుతున్నాయి. పెద్దల ఆరోగ్యం, యువత, చిన్నారులను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పార్కులు, గ్రీన్‌బెల్ట్‌ల్లో అనేక సౌకర్యాలు కల్పించింది. దీనిలో భాగంగానే వార్డుల్లోని పార్కులను అభివృద్ధి చేశారు. కాకినాడ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహపడుతున్నాయి.

ఆహ్లాదకరమైన వాతావరణంలో:

పాఠశాలలకు జూన్ 12 వరకూ సెలవులు కావడంతో నగరంలోని బోట్‌క్లబ్, గాంధీనగర్, రాజా ట్యాంకు పార్కుల్లో సందర్శకుల సందడి నెలకొంది. చిన్నారులు ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆటలాడుతూ ఆనందంలో మునిగిపోతున్నారు. అమ్మమ్మ, తాతయ్యల ఇళ్లకు వచ్చే వారు కూడా స్థానిక చిన్నారులతో స్నేహం చేసి ఆనందంగా గడుపుతున్నారు. స్థానిక బోట్‌క్లబ్ పార్కులో ఉదయం 5 నుంచి 8 గంటలు వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ వాకింగ్, ఓపెన్ జిమ్ చేస్తుంటారు. ప్రస్తుత వేసవికాలంలో పార్కు వచ్చే వారి సంఖ్య రెట్టింపయ్యింది. సాధారణ రోజుల్లో పార్కుకు రానివారు కూడా వేసవి కాలం కావడంతో పార్కులకు వస్తున్నారు. ఇంటిలో ఉన్న వేడిని తట్టుకొలేక పార్కులో చల్లటి గాలికోసం, ఆహ్లాదకర వాతావరణంలో కొంత సమయం సేద తీరేందుకు పార్కుల సమీంలోని ప్రజలు అధికంగా తరలివస్తున్నారు. కాకినాడ నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. దాదాపు అన్ని డివిజన్‌లో పార్కులున్నాయి. వీటిలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం సాయంత్రం వేళ పార్కులు బాట పడుతున్నారు.

ఆటలతో ఆనందం

గాంధీనగర్ పార్కు, రాజా ట్యాంకు పార్కులో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఊయల, జారుడు బల్లలతోపాటు షటిల్ ఆడుకోవడానికి కోర్టులు సైతం ఏర్పాటు చేయడంతో ఇక్కడ చిన్నారులు వచ్చి ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. స్థానిక భానుగుడి జన్మభూమి పార్కులో, రాజా ట్యాంకు పార్కులో స్కేటింగ్ రింగ్ ఉండడంతో స్కేటింగ్ నేర్చుకునేందుకు అధిక సంఖ్యలో చిన్నారులు ఇక్కడికి వస్తున్నారు. సందర్శకులతోపాటు గేమ్‌లు ఆడుకోవడానికి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో పార్కులన్నీ కిటకిటలాడుతున్నాయి.

సాగరతీరంలో సేదతీరుతున్న ప్రజలు

సాగరతీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. సాయంత్రం 5 గంటలు తర్వాత సాగరతీరం సందర్శకులతో కిటకిటలాడుతోంది. సాయంత్రం వేళ చల్లని గాలికోసం, వేసవి వేడి నుంచి ఉపశమనం కోసం ప్రజలు సాగరతీరానికి చేరుకోవడంతో అక్కడ కిటకిటలాడుతోంది. హైదరాబాద్ వంటి ప్రదేశాల నుంచి వచ్చిన వారు అక్కడ సముద్రం లేకపోవడంతో ఈ వేసవి సెలవుల్లో ఎక్కువగా సాగరతీరంలో గడిపేందుకు ఇష్టపడుతున్నారు.



పర్యాటకులతో కిటకిటలాడుతున్న సాగర తీరం

పార్కులో ఆడుకుంటున్నాం



బోట్‌క్లబ్ పార్కులో ఆడుకోవడం చాలా బాగుంది. వేసవి సెలవులు కావడంతో ఆడుకోవడానికి ఎక్కువ సమయం ఉంటోంది. స్కూల్ ఉన్నప్పుడు పార్కుకు వచ్చే సమయం ఉండేది కాదు. ఈ వేసవి సెలవులు చాగా ఎంజాయ్ చేస్తున్నాం. ప్రతి రోజు సాయంత్రం మా చెల్లితో కలిసి బోట్‌క్లబ్ పార్కులో ఆడుకుంటున్నాం. – చింతపల్లి శ్రీకర్

ఎంజాయ్ చేస్తున్నాం



మామూలు సమయంలో స్కూల్‌కు వెళ్లేందుకు, హోమ్ వర్క్ రాసుకునేందుకు సమయం సరిపోతుంది. ప్రస్తుతం సెలవులు కావడంతో సిమ్మింగ్ నేర్చుకోవడంతోపాటు, రాజా ట్యాంకు, బోట్‌క్లబ్ పార్కుల్లో ఆడుకోవడానికి వెళుతున్నాం. వేసవి సెలవులు ఎంతో ఎంజాయ్ చేస్తున్నాం. – జి.దీక్షిత

పుస్తక పఠనంతో ఉన్నత స్థానం

కలెక్టర్ షణ్మోహన్



గోపాలకృష్ణనాయుడు, సుజాత దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, కైట్ విద్యా సంస్థల గౌరవాధ్యక్షుడు ఎం.గోపాలకృష్ణ రచించిన ×కర్మయోగి× పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం జేఎన్‌టీయూకేలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, మేజర్ జనరల్ ప్రసాద్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కైట్ కాలేజీ చైర్మన్ పోతుల విశ్వం, కైట్ డైరెక్టర్ ఐశ్వర్య ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని కర్మయోగి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఐఏఎస్ అధికారి ఎం గోపాలకృష్ణ నాయుడు కాకినాడ ప్రాంతంలో ఎరువుల కర్మాగారం నిర్మాణానికి కీలకపాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. విద్యార్థులు సృజనాత్మకశక్తిని పెంపొందించుకోవడానికి పుస్తకాలు చదవాలని వారు సూచించారు. మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, పోతుల విశ్వం తదితరులు గోపాలకృష్ణతో వారికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఈ సందర్భంగా రచయిత గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను కర్మయోగి పుస్తకంలో తన జీవితంలో జరిగిన సంఘటనలను, మధురానుభూతిని పొందుపరిచానని ప్రతి ఒక్కరూ చదవాలని అన్నారు. అనంతరం గోపాలకృష్ణ నాయుడు, సుజాత దంపతులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ పుస్తకావిష్కరణలో కైట్ విద్యార్థులు, గోదావరి ఎరువుల కర్మాగారం విశ్రాంత ఉద్యోగులు, వివిధ రాజకీయ నాయకులు యువత పాల్గొన్నారు.

పోలీసు శాఖకు స్టాపర్స్ అందజేత



ఆస్పత్రి బహూకరించిన స్టాపర్లను ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ రూరల్: జిల్లాలో ప్రధాన రహదారుల్లో కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణ కోసం వంద మొబైల్ ట్రాఫిక్ బారికేడ్లు (స్టాపర్లు)ను కాకినాడ మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం పోలీసు శాఖకు బహూకరించింది. అచ్చంపేట జంక్షన్ వద్ద ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం ఉదయం వీటిని ఎస్పీ జి.బిందుమాధవ్‌కు మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు అందజేయడంతో వాటిని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రోడ్డు ప్రమాదాల నివారణకు, వాహనాల వేగం నియంత్రణకు, ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు జిల్లా వ్యాప్తంగా వినియోగిస్తామని చెప్పారు. మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు 100 స్టాపర్స్‌ను సమకూర్చామని, ఆస్పత్రి ద్వారా తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి పోలీసు సిబ్బందికి సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసి ఉమెన్ అండ్ చైల్డ్ విభాగాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, సీఐలు చైతన్య కృష్ణ, భగవాన్, ట్రాఫిక్ సీఐలు మురళీకృష్ణ, రామారావు, మెడికవర్ ఆస్పత్రి ఆపరేషన్స్ హెడ్ ఖాద్రి, మార్కెటింగ్ హెడ్ నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలే రేపటి ప్రపంచం

- డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

బాలాజీచెరువు: విద్యార్థుల ఉన్నత ఆశయాలు, ఆలోచనలే రేపటి భవిష్యత్తు ప్రపంచమని ఐడియల్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి అన్నారు. స్థానిక సామర్లకోట రోడ్డులోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో 2025 వార్షికోత్సవ వేడుకలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఆదేశాల మేరకు అకడమిక్ డైరక్టర్ ఎమ్.రంజిత్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షతన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి స్వాగతోపన్యాసం చేస్తూ విద్యార్థుల జీవితంలో కళాశాల సమయం ఎంతో విలువైనదని, నేర్చుకున్న పాఠాలు, సంస్కారం, ప్రవర్తన, క్రమశిక్షణ పైనే విద్యార్థులు సమాజంలో ఏవిధమైన పాత్ర పోషిస్తారనే విషయం అవగతమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ అక్నూ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని కృషి చేయాలన్నారు.మరొక ముఖ్యఅతిథి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, న్యాయవాది అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి చదువుకున్నవారు వివిధ రంగాల్లో ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి. సత్యనారాయణ కళాశాల వార్షిక నివేదికను, ఫిజికల్ డైరక్టర్ పి. శ్రీను క్రీడా నివేదికను సమర్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్టీవెన్ రాజు, వి.నాగేశ్వరరావు, డాక్టర్ కె. స్వామీజీ, చింతపల్లి సుబ్బారావు, మాకినీడి. సూర్య భాస్కర్, వైఆర్ఎల్ చౌదరి, యు. నానిబాబు, గోపాల కృష్ణయాదవ్, విద్యార్థినీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



ఐడియల్ కళాశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ చిరంజీవినీకుమారి

చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహావిష్కరణ



చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: వాల్మీకి రామాయణాన్ని చిత్ర రూపంలో పొందుపర్చిన దేశం గర్వించదగ్గ చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహాన్ని మంగళవారం ఆయన 177వ జయంతి సందర్భంగా కాకినాడ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆవిష్కరించారు. ఎన్నో వైవిధ్యమైన చిత్రాలను ఆణిముత్యాలుగా మలిచిన గొప్ప చిత్రకారుడు రాజారవివర్మ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టెక్నాలజీ లేని రోజుల్లో చిత్రలేఖనం ద్వారా ప్రపంచాన్ని అబ్బురపరచిన మహానీయుడు రాజా రవివర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాకుడు ఉలిశెట్టి విజయభాస్కర్, స్వరూప్, అధ్యక్షుడు తాతపూడి మాధవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి పలువురు కళాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సావ్వేటి భాస్కర్ నాయకులు నయమతుల్లా, గంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన



శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరంలో మంగళవారం శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఎంతగానో అలరించింది. నాట్యాచార్య ఆనెం ప్రసాద్ ఆధ్వర్యంలో అంబికా, వైదేహి, లక్ష్మీశాంతి, జగజ్యోతి, కల్యాణి మాధవి, శ్రీదేవి శ్రీవాణి, హేమలత, సుచిత్ర, లక్ష్మీశాంతి, జగజ్యోతి, దుర్గారావు, ఆశాజ్యోతి వద్ద శిక్షణ తీసుకుంటున్న సుమారు 150 చిన్నారులుతో ఉదయం నుంచి రాత్రి వరకూ శాస్త్రయ నృత్యాలు చేశారు. అనంతరం భరతనాట్యం, కూచిపూడిలో డాక్టరేట్ పొందిన వసంత్ కిరణ్‌ను శాస్త్రీయ నృత్య కళాకారులు సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించి, నాట్యఘృణి అవార్డు ప్రదానం చేశారు. అనంతరం వసంత్ కిరణ్ బృందంతో నిర్వహించిన నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాట్యాచార్య కృష్ణకుమార్, లింగమల్లు కృష్ణమూర్తి, భార్గవి రామకృష్ణ, ఈవీ కృష్ణమాచార్యులు, గణేష్, సుష్మ పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అవసరం



నృత్య కళాకారిణి కల్యాణిని సత్కరిస్తున్న అడ్డాల సత్యనారాయణ తదితరులు



నాట్యాచార్య ప్రసాద్‌కు సత్కారం

కాకినాడ రూరల్: సంప్రదాయ నృత్య కళలను భావి తరాలకు అందించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని నాట్యాచార్య ఆనెం ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నాట్య దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నాట్యం వివిధ రూపాల్లో మానవాళి వికాసానికి దోహదపడిందని, తొలిసారిగా శాస్త్రీయ రూపాన్ని మన దేశంలోనే సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, పట్టాభిరామయ్య, రెడ్నం రాజా పాల్గొన్నారు.

నృత్య సాధనతో ఆరోగ్య ప్రయోజనాలు

బోట్‌క్లబ్: నృత్య సాధన ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా వాగ్దేవి నృత్య కళాశాల స్థాపకురాలు కల్యాణిని మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. నృత్య సాధనతో హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని, బరువు నియంత్రణలో సహాయ పడతాయని, ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. నృత్య సాధనలో మొత్తం శరీర కదలికల వల్ల శ్వాసక్రియ, రక్త ప్రసరణ మెరుగై శరీరంలోని వివిధ వ్యవస్థల పనితీరు వేగవంతమవుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బాల్య దశ నుంచే శాస్త్రీయ నృత్యంలో శిక్షణనిస్తే వారికి మంచి ఆరోగ్యం, ఏకాగ్రత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, యేరూష, భవాని, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ల మంజూరును వేగవంతం చేయండి

కాకినాడ సిటీ: జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆయన నూతన ట్రైనీ కలెక్టర్ జే మనిషాతో కలసి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకంలో ఓసీ, బీసీ వర్గాలకు సోలార్ రూఫ్ ఏర్పాటు, బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు రుణాలు మంజూరు ప్రక్రియ, ఉపాధి హామీ కూలీలకు బీమా నమోదు వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో జిల్లాలో అర్హులందరికీ సోలార్ రూఫ్ ఏర్పాటు కృషి చేయాలన్నారు. జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలందరికీ పీఎం సురక్ష, పీఎం జీవన్‌జ్యోతి యోజనల ద్వారా బీమా నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ జి శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి ప్రసాద్, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

చేయూత సంస్థ సేవలు అభినందనీయం



చేయూత సంస్థ గౌరవ సభ్యుడిగా సభ్యత్వం తీసుకుంటున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

బోట్‌క్లబ్: చేయూత సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం చేయూత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం వద్ద ఆయన తలసేమియా వ్యాధిగ్రస్తులతో సంభాషించారు. చేయూత సంస్థ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగాలు చేసుకుంటూ తమ సొంత నిధులతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి కొత్త జీవితాలు అందిస్తున్న సంస్థ సభ్యులను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ చేయూత సంస్థ గౌరవ సభ్యుడిగా సభ్యత్వం స్వీకరించారు. చేయూత సంస్థ వ్యవస్థాపకుడు రవికుమార్ మాట్లాడుతూ 8 ఏళ్లుగా సభ్యులు, దాతల సహకారంతో రూ.8 కోట్లతో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పంటలతో పాటు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రోటరీ చేయూత భవన్‌లో 40 మంది అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంతో వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న విద్యార్థినీవిద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 2వ రోజు మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పుస్తక పఠనం, కథలు చదివించారు. 9 నుంచి 10 గంటల వరకు రిటైర్డ్ విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ మాస్టారు విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ కోర్స్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు పేపర్లతో రకరకాల బొమ్మలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది రాజు, నాగేంద్ర కుమార్, ఎ.దుర్గాప్రసాద్, అరుణ, స్థానిక పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కరప: వేసవిలో విద్యార్థులు బయట తిరగకుండా లైబ్రరీకి వచ్చి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య అన్నారు. మండలం వేళంగి శాఖాగ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతుల్లో ఆయన పాల్గొని విద్యార్థులు పలు అంశాలు వివరించారు. చెక్కా నూకరాజు చెప్పిన నీతికథలు విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. కరప ఉపగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు.